# ఎవరు స్వతంత్రులు?

జ్ఞానేశ్వర్రావు ప్రభుత్వోద్యోగానికి రాజీనామా చేసేసి, తను సొంతంగా 'స్వయం ఉపాధి పథకం' క్రింద ఓ కిళ్లీకొట్టు ప్రారంభించాడని తెలిసీ ఆశ్చర్యపోయాడు శతభిషం! కిళ్లీకొట్టు ప్రారంభోత్సవానికి వెళ్లేడు ఓ చిన్న షామియానా. ఇరవై కుర్చీలు. అందులో జ్ఞానేశ్వర్రావు శ్రేయోభిలాషులు డ్రింకులు తాగుతున్నారు. "రారా శతభిషం..రా" అని సాదరంగా మిత్రుణ్ణి ఆహ్వానించి డ్రింకు ఆఫర్ చేశాడు జ్ఞానేశ్వర్రావు. "నువ్వు కిళ్లీ కొట్టు పెట్టుకోవడం ముదావహమే. ప్రతి వ్యక్తి ప్రభుత్వోద్యోగం కోసం ఎగబడకూడదు. కాని పెర్మనెంటుగా దొరికిన ప్రభుత్వోద్యోగాన్ని ఎందుకు వదులుకున్నావో అర్థం కావడం లేదు. గ్రాట్యుయిటీ పించను, నీ అనంతరం మీ భార్యకి పించను, ఇన్ని బెనిఫిట్స్ పోగొట్టుకుని కిళ్లీకొట్టు పెట్టుకోవడంలో ఔచిత్యం ఏమిటో బోధపడ్డం లేదు!" అన్నాడు శతభిషం.

"ఇందులో నీకు తెలియందేముందిరా శతభిషం? ఆఫీసుల్లో 'కాకా'సురులు ఎక్కువైపోయారు ఆనాడు శ్రీరామచంద్రుడు దయతలచి కాకాసురుణ్ణి చంపేయకుండా, కన్ను ఒక్కటే తీసేసి విడిచిపెట్టడం వల్ల మనం ఛస్తున్నాం ఈనాడు. ఆ కాకాసుర సంతానం గవర్నమెంటాఫీసుల్లో విస్తరించి నానా బీభత్సం సృష్టిస్తున్నారు! నా స్వభావం నీకు తెలుసుకదా? స్ట్రెయిట్ ఫార్వర్డ్! ఒకరికి గులాముగా వుంటూ సలాములు కొట్టడం నాకు చేతకాని పని నాక్కావలసిందల్లా స్వేచ్ఛ! స్వాతంత్ర్యం! ఈ కిళ్లీకొట్టు పెట్టుకున్నానా? నేనెవరిమీద ఆధారపడనవసరం లేదు. ఎవరికీ సలాములు కొట్టనవసరం లేదు. దిక్కుమాలిన గవర్నమెంటుద్యోగం వొదిలేసి హాయిగా స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నాను!" అన్నాడు.

"ఏమిట్రా స్వేచ్ఛ నీ బొంద స్వేచ్ఛ! ప్రతివాడూ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అంటూ కబుర్లు చెబుతారు. నువ్విప్పుడు ఓ కిళ్లీకొట్టు కమ్-ఫ్యాన్సీగూడ్స్ షాపు పెట్టుకున్నావు. నీ దగ్గర కావాల్సిన వస్తువులు కొనుక్కుందికి కస్టమర్స్ వస్తూంటారు. నీ దగ్గర వాళ్లక్కావల్సిన వస్తువులు కొనుక్కోపోతే వాళ్లు బతకలేరు. అలాగే నువ్వు వాళ్లకి సరుకులు అమ్మకపోతే బతకలేవు. అంటే నీ మీద కస్టమర్సూ, కస్టమర్స్ మీద నువ్వూ ఆధారపడి జీవిస్తున్నారన్నమాట! డాక్టర్లు పేషంట్ల మీద ఆధారపడతారు. పేషంట్లు డాక్టర్ల మీద ఆధారపడతారు. లాయర్లు లిటిగెంట్లు మీద ఆధారపడతారు. అంతెందుకు? నువ్వీ కిళ్లీకొట్టు పెట్టడానికి బ్యాంకు మీద ఆధారపడ్డావు. బ్యాంకు నీ మీద ఆధారపడింది మనుషులు ఏ వృత్తిలో వున్నా, ఏ వుద్యోగంలో వున్నా, పరస్పరం ఒకరిపై ఒకరు ఆధారపడి జీవిస్తున్నారన్న నగ్నసత్యాన్ని, నీకు తెలియకుండానే నువ్వు మరిచిపోతున్నావ్! ఏ వ్యక్తీ స్వతంత్రజీవనుడు కాడనే విషయం గుర్తుంచుకుని మసలుకో!" అన్నాడు శతభిషం. ఇన్నాళ్లూ భూగోళం తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరుగుతోందనే అనుకున్నాడు జ్ఞానేశ్వర్రావు. కాని ఈ సమాధానంతో తన బుర్ర కూడా గిర్రున తిరిగి తన బుర్ర తిరుగుడుకు ఫుల్‌స్టాప్ పడిపోయింది.

5-6-1997

ఆంధ్రభూమి వీక్లీ